క్లుప్తంగా

ఉప్పాంకలో 'ఫ్యామిలీ డాక్టర్'



ఉప్పాంకలో వృద్ధులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: పల్లెల్లో వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు కోరారు. మండలంలోని ఉప్పాంకలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులు, గర్భవతులకు, బాలింతలకు, వృద్ధులకు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో వైద్య పరీక్షలు మందులు ఇచ్చారు. గర్భవతులు 104, 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

తోటకు నిప్పు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం తాళంబేడుకు చెందిన కార్తికేయరెడ్డి పొలానికి ఆగంతకులు నిప్పంటించారు. మంటల ధాటికి మామిడి, కొబ్బరిచెట్లు, డ్రిప్ పైపులు కాలి బూడిదయ్యాయి. సుమారు 50వేల రూపాయల పంట నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

యోగా గొప్ప వరం



మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు కలెక్టరేట్: భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరం యోగా అని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చిత్తూరు యోగాసన క్రీడా అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 5వ రాష్ట్ర స్థాయి న్యాయమూర్తుల శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం గడిపేందుకు దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ, యోగాతో ఆరోగ్యాన్ని, ఆధ్యాత్మికతను, ప్రశాంతమైన జీవనం పొందవచ్చన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. ప్రారంభ కార్యక్రమంలో నగర మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, పీవీకేఎన్ ప్రిన్సిపల్ జీవన జ్యోతి, యోగా అసోసియేషన్ అధ్యక్షురాలు రాధిక, సెక్రటరీ యుక్త పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణ భేష్



తాంటిగుంటపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

సదుం: స్థానిక పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రా ల్లో మరుగుదొడ్ల నిర్వహణ బాగుందని కేంద్ర బృందం అధికారి రాజేష్ కితాబిచ్చారు. కేంద్ర బృందం శుక్రవారం తాటిగుంటపాళ్యెం గ్రామ పంచాయతీలో పర్యటించింది. పారిశుద్ధ్యం, మురుగు కాలువల శుభ్రత, తడి, పొడి చెత్త నిర్వహణ, మరుగుదొడ్ల వినియోగంపై పరిశీలించింది. పంచాయతీలో పాఠశాలలు, ప్రార్థన మందిరాలు, ఆరోగ్య, అంగన్‌వాడీ కేంద్రాలు బాగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరిబాబు, సర్పంచ్ యల్లప్ప, కార్యదర్శులు జనార్ధన్, మోహన్, రోజా తదితరులు పాల్గొన్నారు.

మంచినీటికి ఇబ్బందిగా ఉంది సారూ!



సమస్యలను తెలుపుతున్న విద్యార్థిని

పలమనేరు: 'మా పాఠశాలలో తాగునీటి ఇబ్బందిగా ఉంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. మీరైనా చర్యలు తీసుకోండి' అని పలమనేరు సమీపంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలను శుక్రవారం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు సందర్శించారు. విద్యార్థినులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఇక్కడ మొత్తం 640 మంది విద్యార్థినులు వున్నట్టు తెలిపారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తికి అస్వస్థత



చౌడేపల్లె: మండలంలోని 29 ఏ చింతమాకులపల్లె పంచాయతీ పిఎల్ కొత్తూరులో శుక్రవా రం పాముకాటుతో వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. గ్రామానికి చెందిన వెంకటరమణ(55) మామిడి తోటలో కాపలాగా ఉన్నాడు. ఆయన శుక్రవారం మామిడి తోటలో తిరుగు తుండగా పాము కాటేసింది. అస్వస్థతకు గురైన అతన్ని కుటుంబ సభ్యులు 108లో పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కియోస్క్ సేవలకు మంగళం

- రైతు సేవా కేంద్రాల్లో నిరుపయోగంగా కియోస్క్‌లు
- వాటి స్థానంలో పీఎంఏఐడీ యాప్
- కొత్తయాప్‌తో అరకొరగా సేవలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు



రైతు సేవా కేంద్రం



రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా కియోస్క్

గుడిపాల: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇప్పటికే గత ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను అటకెక్కించింది. మరి కొన్నింటిని కాపీ కొట్టి, పేర్లు మార్చి, అరకొరగా అమలు చేస్తోంది. గ్రామస్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా తీసుకొచ్చిన సచివాలయ, రైతుభరోసా కేంద్రాలను సైతం ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందనే విమర్శలొస్తున్నాయి.. గత ప్రభుత్వం రైతులు మండల కేంద్రానికి వెళ్లే పనిలేకుండా మండలంలో మొత్తం 17 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. వీటిలో కియోస్కలను ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు, పశువుల దాణా, పంటలకు మార్కెటింగ్..ఇత్యాది సేవలు పొందే అవకాశం కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుసేవా కేంద్రాల్లోని కియోస్క్‌లను నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వ సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో సచివాలయ సేవలు సైతం ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం కియోస్క్‌లను కేవలం ఎరువుల అమ్మకాలకు మాత్రమే ఉపయోగిస్తుండడంతో మిగిలిన సేవలు పొందలేకపోతున్నారు. అధికారులు మాత్రం వాటిని అన్ని రకాలుగా వినియోగిస్తున్నామని చెబుతున్నారు. ప్రస్తుతం కియోస్క్‌ల స్థానంలో పీఎంఏఐడీ యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే ఈ యాప్‌లో పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కియోస్క్‌ల సేవలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

సేవలు కొనసాగించాలి

గత ప్రభుత్వం ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌ల సేవలు కొనసాగించాలి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కొనుగోలుతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలను తెలుసుకోవడానికి అవి ఎంతగానో ఉపయోగపడేవి. గత ప్రభుత్వ విధానాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా కొనసాగించాలి.అన్ని సేవలను కూడా రైతు సేవా కేంద్రాల్లోనే అందేలా చూడాలి.
–ఈశ్వర్, రామాపురం

నిర్లక్ష్యమెందుకు

కియోస్క్‌లపై నిర్లక్ష్యం వహించడం సరికాదు. అక్షరజ్ఞానం లేని రైతులను దృష్టిలో ఉంచుకుని రైతు సేవా కేంద్రాలను మరింత ఆధునీకరించి కియోస్క్‌లను వినియోగంలోకి తేవాలి. గతంలో మాదిరిగానే రైతుభరోసా కేంద్రాల్లోనే అన్నీ వసతులు ఉండాలి.
–మునిరత్నం, వెంగమాంబపురం

కేవలామృతంపై ప్రవచనాలు ప్రారంభం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో శుక్రవారం శ్రీ నారాయణి సేవా సమితి ఆధ్వర్యంలో కేవలామృతంపై రాధా మనోహర్ దాస్ ప్రవచనాల కార్యక్రమం ప్రారంభమైంది. శ్రీనారాయణి అమ్మకు ప్రత్యేక పూజలు చేసి ప్రవచనాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, హిందూ పరిరక్షణ అవసరమన్నారు. ప్రతి ఒక్కరికీ హిందూ తత్వంపై అవగాహన కల్పించాలని అన్నారు.

21న జేఎల్‌ఎంలు చలో విజయవాడ

చిత్తూరు కార్పొరేషన్: తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న జేఎల్‌ఎం గ్రేడ్–2 ఉద్యోగులు తెలిపారు. తమ డిమాండ్ల పై శుక్రవారం ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్‌కు ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఒకే రకమైన సర్వీసు రూల్ అమలు చేయాలన్నారు. తమ సమస్యలపై పలుమార్లు అధికారులకు, ప్రభుత్వానికి వినతి చేసినా ఫలితం లేదన్నారు. కార్మిక సంఘాలకు గుర్తింపు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలన్నారు. సచివాలయ ఉద్యోగులతో సమానంగా సెలవులు, భత్యాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరి, విజయ సారథి తదితరులు పాల్గొన్నారు.

గజేంద్రుడిపై దశరథరాముడి వైభవం



గజేంద్రుడిపై విహరిస్తున్న దశరథరాముడు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండ రాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గజేంద్రుడిపై దశరథరాముడు కొలువుదీరి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. విద్యుద్దీపాలు, పుష్పాలు, గజమాలతో చిద్విలాసంగా విహరించారు. ఇంటింటా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. తొలుత ఉదయం ఆలయంలో అర్చకులు సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉభయదారులు స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం చేయించారు.

ఉయ్యాల సేవ

సాయంకాలం భక్తిప్రపత్తులతో ఉయ్యాలసేవ నిర్వహించారు. ఉభయదారులు పూజాసామగ్రి, ప్రసాదాలు, సుగంధ పరిమళ పుష్పాలు, గజమాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు.

నేడు రథోత్సవం

శనివారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, తోమాల సేవ, 11 గంటలకు ఉయ్యాలసేవ, మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు. భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం చేస్తామని, రాత్రి తమిళంలో కురవంజి వీధి నాటకం ప్రదర్శించనున్నట్టు తెలియజేశారు.



హాజరైన భక్తులు



కోదండరామాలయంలో నిర్వహిస్తున్న ఉయ్యాలసేవ

ప్రారంభోత్సవానికి నోచుకోని ప్రభుత్వ భవనాలు





పెయింటింగ్, తలుపులు, వైరింగ్, ప్లంబింగ్ పనుల అసంపూర్తితో ఉన్న సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్

- 35 యర్లంపల్లెలో నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు
- అసంపూర్తి పనులు పూర్తి చేయని కూటమి ప్రభుత్వం



రైతు సేవా కేంద్రం

ఐరాల: మండలంలోని 35 యర్లంపల్లెలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకోక పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 35 యర్లంపల్లెలో రూ.40 లక్షలతో సచివాలయాన్ని, రూ.20.5 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని, రూ.17.50 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మించారు. ఈ మూడు భవనాల్లో విద్యుత్ వైరింగ్, పెయింటింగ్, తలుపులు, ప్లంబింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అసంపూర్తి పనులను ఏమాత్రం పూర్తి చేయకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయని గ్రామస్తులు మండిపడుతున్నారు. భవనాలు అందుబాటులోనికి తెస్తే తమకు ఉపయోగకరంగా ఉంటుందని, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వరసిద్ధుని సేవలో సినీ ప్రముఖులు



డ్రమ్స్ శివమణి, సంతోష్ శోభన్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం పేరొందిన డ్రమ్స్ వాయిద్యకారుడు శివమణి, సినీ నటుడు సంతోష్ శోభన్ తమ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈఓ పెంచల కిశోర్, ఏఈఓ రవీంద్రబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం



పుంగనూరు: వేడుకలు జరుపుకుంటున్న కార్మికులు



పలమనేరులో..

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. యూనియన్ అధ్యక్షుడు వెంకట్రమణారెడ్డి మాట్లాడుతూ కార్మికులపై అధికారుల వేధింపులు మానుకోవాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా వున్న 35 వేల కార్మికుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అడవినాథకుంటలోవున్న మోడల్ స్కూల్‌కు వెళ్లే బస్సులు పూర్తిగా దెబ్బతిన్నాయని, మంచి బస్సులు నడపాలని సూచించారు. డిపోలో ఉన్న 35 మంది దినసరి కూలీ డ్రైవర్లను క్యాజువల్ కార్మికుల కింద తీసుకోవాలని కోరారు. జీవి.రమణ, భాస్కర, నాయక్, గంగాధర్ పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం ఈయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి జెండా ఎగురవేశారు. డిపో అధ్యక్షుడు కె.బాలక్రిష్ణ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి యూని యన్ ఎంతో కృషి చేస్తోందన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు హేమాచలం, సీఐటీయూ సీనియర్ నాయకులు చెన్నకేశవులు, కార్యదర్శి బాషా పాల్గొన్నారు.

ఏఐటీయూసీ,మున్సిపల్ వర్కర్ల ధర్నా



చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు నగర జనాభాకు తగినట్టు మున్సిపల్ కార్మికులను నియమించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. పారిశుద్ధ్య, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు నగరం జనాభా పెరిగిందని, ప్రస్తుత జనాభా, విస్తీర్ణానికి తగినట్టు పారిశుధ్య కార్మికులను అదనంగా నియమించాలన్నారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి దాసరి చంద్ర మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. వారి మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి పరీక్షలు ఉచితంగా చేయాలన్నారు. ధర్నాలో ఏఐటీయూసీ నాయకులు గోపీనాథ్, రమాదేవి, విజయ్‌కుమార్, ఏపీ మహిళా సమైఖ్య నాయకులు విజయగౌరి, చిత్తూరు మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ వర్కర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకాలు



విశేషాలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మకు శుక్రవారం రాహుకాలంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య రాహుకాలంలో సంప్రదాయంగా అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈవో ఏకాంబరం ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు ఉచిత అన్నప్రసాదాలు అందజేశారు.

అధిక జనాభాతో అనర్థాలు



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్యాధికారి రెడ్డెప్ప



తవణంపల్లె హైస్కూల్లో ఏర్పాటు చేసిన మానవహారం

ఐరాల: అధిక జనాభా అనర్థాలకు దారి తీస్తుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డ–బిడ్డకు మధ్య అంతరం ఉండాలన్నారు. అధిక జనాభా వల్ల కుటుంబ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందన్నారు. జనాభా పెరిగే కొద్దీ ఆహార సమస్యలు తలెత్తుతాయని, అలాగే వ్యాధులు కూడా ఎక్కువ అవుతాయన్నారు. జనాభా పెరగడానికి ముఖ్య కారణం బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలేనన్నారు. అనంతరం పీహెచ్‌సీ నుంచి వైద్య సిబ్బంది, విద్యార్థులతో కలిసి పాతపాళ్యం వరకు ఒకరు ముద్దు– ఇద్దరు వద్దు అంటూ ర్యాలీ చేసి బజారువీధిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి విజయ్‌కుమార్, సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చిన్న కుటుంబం చింతలేని కుటుంబం

తవణంపల్లె: చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా తవణంపల్లె హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానవహారం ఏర్పాటు చేసి మాట్లాడారు. అధిక జనాభా అభివృద్ధికి అవరోధమని, ఇద్దరు ముద్దు–ఆపై వద్దు, బాల్య వివాహం అనారోగ్యానికి మూలం, ఆడ మగ ఇద్దరూ సమానమేనంటూ నినాదాలు చేశారు. డాక్టర్ కేశవనారాయణ విద్యార్థులకు జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే నే చదువులో కూడా బాగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, హెచ్‌ఎం వేణుగోపాల్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, వైద్య బృందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.